# గోలీ మహల్

(రూపవాణి - మాసపత్రిక 'జన్మదిన సంచిక' మార్చి 1945)

**జా**న్వర్ తన భుజము మీద నున్న బరువును దించి వీపానించి యాతలుపును త్రోసెను. ఆ తలుపు ముప్పదియేండ్ల క్రింద నొకసారి తెఱువబడెను. జాన్వరు దేహములో ఏనుగంత బలమున్నది. ఆ యినుప కవాటమతని యొత్తిడి కాగలేక తన కిష్టము లేనట్లు మిక్కిలియు నెమ్మదిగా లోనికి తెఱువబడెను. గాఢాంధకారము. అచ్చట పగలు రెండు జాములప్పుడే కన్ను కన్ను పొడుచుకున్నను కానరాని చీకటి. అది నాల్గు గజముల వెడల్పుగల, ఫిరంగుల చేత భేదింపరాని రాతిగోడతో నిర్మింపబడిన యొక చీకటికొట్టు. గోడ పై భాగములోనుండి యందులోనికి త్రోవ. అచ్చట చీకటికొట్టు కలదని తెలిసినవారు జీవించియున్న వారిలో నిద్దరే. ఒకడు పాదుషా. రెండవవాడు జాన్వరు.

అతనికీ పేరు పాదుషాయే పెట్టెను. జాన్వరుకు తెలిసినవి రెండే సంగతులు. ఒకటి తా నేనుగునన్న విషయము. రెండవది తనకు మేతవేయునది పాదుషా యన్న విషయము. జాన్వరునకు మూగతనము వాక్కునందే కాదు, ముఖావయవములయందును, హస్తములయందు గూడను.

జాన్వరు తన మూపు మీది బరువును ఆ చీకటికొట్టులో దించి మఱల తలుపువేసి యినుప తాళములు బిగించి తన దారిని దాను బోయెను.

మఱునాడు పగలు పన్నెండు గంటలవేళ అంత చీకటి కొట్టులోనికి నెచ్చటనుండి వచ్చునో, పగలు జామున్నర ప్రొద్దెక్కు వఱకు సన్నని వెలుగులు వచ్చును. ఆ వెలుగులో కొట్టులోని నాల్గుమూలలు లీలగానొక గడియసేపు కనిపించును. ఆ సమయమునకు గడచిన రాత్రిపూటనే జాన్వరు రహస్యముగా వచ్చి యుంచిపోయిన యాహారపదార్థములు, మంచి తీర్థమును కనిపించును. ఆ కొట్టునకు ముప్పదియేండ్ల క్రింద తెఱువబడిన యా ద్వారము కాక, వేఱొక త్రోవలేదు. ఆ యాహారపదార్థములు ప్రతిదినము లోనికెట్లు వచ్చునో ముప్పది యేండ్లుగా నచ్చట ఖైదీగా నుండిన యతనికేమియు తెలియదు.

అతడానాడు వెలుగురేకలు వ్యాపించినపుడు హఠాత్తుగా నాగదిలో తానేకాక మఱి యింకొక వ్యక్తి యున్నటులు తెలిసికొనెను.

"ఎవరునీవు?- ఎవరు నీవు? - ఎవరు నీవు?"

తరువాత చాలసేపటివరకు నిశ్శబ్దము. మఱికొలది కాలములో చీకట్లు యథాప్రకారముగా ముసురుకొనెను. తరువాత కొంతసేపటికి క్రొత్తగా వచ్చిన వ్యక్తి ఆకలి, ఆకలి యని విలపింపజొచ్చెను. ముప్పదియేండ్లుగా నున్న ఖైదీ ఆ కంఠధ్వని స్త్రీ కంఠముగా గుర్తుపట్టెను. అతడాహారపదార్థములు, మంచి తీర్థమును క్రొత్తవ్యక్తి చేత కందిచ్చెను. ఆమె మొదట తెలిసికొనలేక తరువాత భోజనపదార్థములని తెలిసికొని భుజించెను.

మఱునాడు మఱల వెలుగురేకలు వచ్చెను. ప్రాతఖైదీ భోజన మారంభించెను. క్రొత్తఖైదీ సమయమదియని తెలిసికొని తానుగూడ భోజనముచేసెను.

పదిరోజులు క్రొత్త ఖైదీ విలాపధ్వనులే. పాత ఖైదీ మాట పలుకులేదు.

ఆ స్త్రీ యనుకొనెను. ఆ పురుషుడు మూగవాడని, తరువాత గొన్నాళ్ళకు "నీవు మూగవాడవా" యని యడిగెను. రోజు గడచినదనిన యాగడియసేపు గమనించిన వెలుగు మాత్రమే గుర్తు. ఆ వెలుగు వచ్చినప్పుడే యామె యతనిని రెండు మూడు ప్రశ్నలు వేయును. ఆ చీకటిలో మాటలు కూడా వినిపించవని యామె హృదయములోని యొక భావమేమో!

క్రమముగా నామెకు చీకటిలో గూడ మాటాడవచ్చునని తెలిసెను. సమాధానము చెప్పుట యతడు నేర్చుకొనెను.

ఒకరోజున

"నీవు మూగవాడవా?"

"కాను"

మఱియొక రోజున...

"మాటాడవేమి?"

ఎవరు నీవు?

కొన్నాళ్ళకు.....

"నా పేరు మెహర్. నేనొక సామాన్య సంసారి కూతురును. నాకు వయస్సు వచ్చినది. నా యందము ముందర రాజ స్త్రీలు కూడ పట్టరని చెప్పుకొనిరి. అద్దములో నాయంతట నేనే చూచుకొందును. అద్దములోని ప్రతిబింబ సౌందర్యము లోకములోని స్త్రీల సౌందర్యముతో బోల్చుకొందును. లోకములో నందఱ కనుఱెప్పలు పలుచగా నుండును. నా కనుఱెప్పలలో మాంసమెక్కువ యున్నది కాబోలు.

అవి చక్కగా నుండి నా కనులు మూతపడీ పడనట్లు, నా కన్నులలోని లౌల్యము, సౌందర్యము - నా హృదయములోని యాకాశము పట్టెడిది కాదు.

నా సర్వావయవములు నేదో నృత్యారంభ భంగిమ కభిముఖముగా నున్నట్లుండెడివి. నా ముంగురు లెట్టిని నా ఫాలభాగముపై పడకుండనే పడుచున్నట్లుండెడివి. ఆ యుద్ధములోని ప్రతిబింబము యొక్క కనులు నన్ను పిలుచుచున్నట్లుండెడివి. నాకోసము పెద్ద నవాబులు, మంత్రులు, సేనానాయకులు మాతండ్రిగారి నడిగిరి. నేను ఊ యన్నచో నాతండ్రి కోటీశ్వరుడయ్యెడివాడు. కాని నా మనస్సు మా దూరపు చుట్టము, కవి, చిత్రకారుడునైన యొక పురుషుని మీద లగ్నమయ్యెను. అతడు గాయకుడు కూడను. అతడు పాడిన పాట యుద్ధములోని నా ప్రతిబింబమును జూచినట్లుండెడిది. అతడు చిత్రించిన యే చిత్రమైనను నా తనూసృష్టి సహస్ర ముఖముల జేసినట్లుండెడిది. అతడు వ్రాసిన యే పద్యమైనను నాకంటి తుదయందలి కాంతివలె నుండెడిది. అతడే నేను - నేనే యతడు - అతడు పేదవాడు.

అతని యాస్తియంతయు నతని నోటిలోని యక్షరము. అతని సంపద యంతయు నతని కంఠమాధుర్యము - అతని వితరణ మంతయు నతని కుంచియ చివళ్ళ నుండి స్రవించు వర్ణ సామరస్యము. నా తండ్రి నా కోసమే నన్నతనికిచ్చెను.

మా కాలము సుఖముగా గడచెను. చెట్టుకొమ్మ చివర నున్న పూవులలో పరిభ్రమించు తేటికి, నా పూవులకు - చెట్టు మొదట నఱకుచున్న గొడ్డలి, వాని గొడవ తెలియదు. వసంతర్తువు నందు జన్మ జన్మాంతరములయొక్క సుకుమారము లైన సుకృతము లప్పుతెచ్చుకొన్నట్లు కలిపించుకొన్న లేత రంగులు, మెత్తదనాలు, గుబాళించుకొన్న నెత్తావులు, వీని గొడవ లోననే పడియున్న పూజవరాండ్రకు ఆగామి గ్రీష్మఋతువు యొక్క తగులబెట్టు వేడిమిలోని మంటలు తెలియవు.

నా సౌందర్యము నాకు తెలియకుండనే రాజధాని యంతయు మ్రోగెను. నాచేత నంగీకరింపబడని సేనాపతులయు, సరదార్లయు నీర్ష్య పాదుషా చెవులవద్ద మత్సౌందర్య ప్రశంసగా మారెను.

ఆ పాదుషా యేమి పాదుషా! తఖ్తుమీద నెక్కిననాడే యన్నదమ్ములయు సమీపబంధువులయు రక్తములు రాజ్యకాళికి బలియిచ్చిన పాదుషా! వాని గుండెలో ప్రేమ యున్నదా? వాని ప్రేమ దివ్యములైన సౌధములుగా ప్రకాశించుచున్నదట.

ఆ పాదుషా యేదో మిషపెట్టి నా భర్తను వేఱే పనిమీద దేశాంతరము పంపించెను. అంతకు పూర్వమే యతనికొక పెద్ద యుద్యోగమిచ్చెను. ఆ యుద్యోగ మెవరడిగిరి? నేనడుగలేదు. నా భర్త యడుగలేదు. నా తండ్రి యడుగలేదు-మా ప్రేమయే మాకు ఆహారముగా బ్రతుకుచున్న జీవులము. ఇంక ప్రేమనే తిని బ్రతుకనక్కరలేదు. మా ప్రేమాదేవిని దేవతా వీధులలో విహరింప చేయవచ్చును. పాదుషా యిచ్చిన యన్నమును వేఱే తినవచ్చునని దీపమును జూచిన పురుగుల వలె భ్రమసిపోయితిమి. ఉద్యోగమిచ్చి నెలనాళ్ళు కాలేదు. అదివఱకు నిముసకాలపు టెడమును మా ఇరువురి నడుమ రానీయజాలని మేము, జాముల కొలంది యెడముల కోర్చుచున్నాము. నెలనాళ్ళలో నీ ప్రయాణము తేపు వచ్చును. మాపు వచ్చును ననుకొనుచుండ - నొకానొక మాపునందు వచ్చిన వార్త యేదో తిరుగుబాటడచుటకు-నాభర్త పంపించబడినాడని, యచ్చట యుద్ధము జరిగినదని, నా భర్త యుద్ధములో మరణించినాడని, పాదుషా యొక్క జిల్లాలో నుండి మా యింటికి లక్ష యోదార్పు వార్తలు, లక్ష కానుకలు, ప్రశంసలు, సాంత్వనోక్తులు, వచ్చిన కానుకలతో మా యిల్లు కుబేర సౌధమయ్యెను. నాభర్త యొక్క రాజభక్తి, రాజ్యమంతయు బ్రశంసింపబడెను. చివరకు పాదుషా రెండు లక్షలు వ్యయము చేసి నా భర్త చనిపోయినచోట పెద్ద గోరీ కట్టించెను. ఆ గోరీ నేను పోయి చూచుటకు నా వెంట వచ్చిన పరివారమొక మహారాణి యొక్క పరివారము!!

నా భర్త యొక్క ఋణము పాదుషా సరిగా తీర్చెనా లేదా యని నాకు దినదినము వార్తలు వచ్చెడివి. పాదుషా యందలి నా కృతజ్ఞత యాదినములలో నాగుండె పట్టలేదు. కొన్నాళ్ళకు - నన్ను కోటకు రమ్మని, నా దుఃఖోపశము నార్థము పాదుషా తన చేతులతో నాకొక పెద్ద కానుక యీవలయునని యున్నదని, వార్తమీద వార్తగా నెలనాళ్ళు వచ్చెను. ఆ యొత్తిడిని నేను తట్టుకొనలేకపోయితిని. తల్లిదండ్రులయు బందుగులయు బలవంతమెక్కువయ్యెను.

ఒకనాడు నేను గోటలోనికి బోయితిని. మఱల కోట నుండి తిరిగి రాలేదు. వారము తిరిగి రాలేదు. వారము దినములలో నా తండ్రికి నా తమ్ములకు సేనాధిపత్యములు మహోద్యోగములు నయ్యెను. దాసీవాండ్ర పోరు నా చెవులలో భరింపరాని దయ్యెను. పాదుషాకు నేనెంతో ఋణపడియున్నాను. అది తీర్చుటకైనను నతని ప్రేమ నంగీకరింపవలయును. లేనిచో నా బంధువుల యుద్యోగములు, మున్ను లేనివి పోనే పోవును. అదివఱకున్న ప్రాణములు కూడ బోవునట్లు తోచెను.

అప్పటికి నా భర్తపోయి రెండేండ్లు కావచ్చును. అతని యందలి నా ప్రేమ పగటి వెలుగులు, కనరాని జ్యోతిస్స్వరూపమునందు లీనమైనట్లు; నా హృదయాంతరమునందెచ్చటో ప్రాణము పోయిన తరువాత శరీరము లేనట్టి సంస్కార సముదాయము భావరూపమై జీవునివలె నుండునట్లుండెను. ఈ బహిరావరణ మంతయు బాదుషా తనయందలి నా కృతజ్ఞతాభావము చేత నా బందుగుల యొక్క క్షేమవాంఛ చేత నిండించెను. నేను బాదుషాకు భార్యనై పోతిని.

ఆనాటినుండి రాజ్యమంతయు నేను పాలించు చున్నట్లుండెను. పాదుషాకును నాకును నడుమగల ప్రేమభావమునకు లైలా మజ్నునుల ప్రేమభావమే పోలికయయ్యెను. ఆదర్శకమైన ప్రేమకు మా యిద్దరి పేరులు కలిపి చెప్పబడుచుండెను. నాకదియంతయు నెప్పుడో తలచుకొన్నప్పుడు తప్ప దక్కిన సమయములయందు జరుగుచున్నట్లే యుండెడిది కాదు. ప్రేమ ఆత్మజ్యోతి వంటిది. అది చెడనిదై మనోబుద్ధ్యహంకారములను దాటి నిత్యము తాను వెలుగుచునే యుండును. దాని నుండి వచ్చినట్లున్న మాయచేత దక్కిన అయ్యధార్థమైన దంతయు నడచుచున్నట్లే యుండును. ఈ ప్రాణికి పరమమైన ప్రేమ, ఆ ప్రేమకు సంబంధించిన యితర బాహిరములైన విషయము లదృష్టము చేత రెండు గలసియుండును. దురదృష్టము చేత వేఱుగా నుండును. ముప్పదియేండ్ల నా శరీరముతోడి రాణితనము–నా ప్రేమరాణితనముగా లోకమనుకొనెను. పాదుషా యనుకొనెను. నేను గూడా ననుకొన్నానేమో నాకు తెలియదు. ఆ పాదుషాకు నేనననిచో బ్రేమయున్నదా? అతనికి సంగీతము తెలియదు. పాడలేదు. అతడు మాటాడిన మాటలో నాకంటి కాంతి యెప్పుడును గన్పించలేదు. అతడు చిత్రకారుడు కాడు. అతడొక బొమ్మ యెప్పుడు గీయలేదు. అతడు మనసార భావించిన యే స్త్రీ రూపము నందును నా శరీరాంచలము యొక్క రేఖా లేశములను లేవు. అతడు కవి కాడు. అతడొక్క పద్యమును వ్రాయలేదు. అతని నోటివెంట వచ్చిన యక్షరముల వెనుకనున్న భావము నందు నా ప్రతిబింబ స్వరూపము చాయలైనను లేవు.

ఆ ఛాయలయొక్క స్మృతి యొక్క కవళికలును లేవు. అతడు నా శరీర సౌందర్యమును మెచ్చుకొనును. నాదేహ నైగనిగ్యమును నివ్వెఱపోయి చూచును. నా నెత్తురు, నా మాంసము, నా బొమికలు తినెడు వానివలె నటించును. తన

శరీరము చేత నా శరీరము నతలకుతలము చేయ వాంఛించును. నా సృష్టిలో సారభూతమైన యేదో యొక యభితృప్తి తెచ్చు పొలము మేరకు బంటకాపు కాదగిన తేజోలేశమతని మనోభావము దాటిన యాధ్యాత్మిక ప్రవృత్తిలో లేదు. ఎంతసేపు మన్నును మంటిచేత గప్పవలెనని మన్ను చేత మంటి నేలించవలెనని.

ముప్పదియేండ్లు గడచెను. ఈ గదిలోని చీకటి కప్పుడప్పుడొక వెలుగు గడియ యున్నది. ఆ చీకటి కదియు లేదు. ఈ చీకటిలో నెట్లు వచ్చుచున్నదో, వాతాయనమును లేని వాయు ప్రసారము కలదు. ఈ చీకటి కొట్టు నిర్మించిన శిల్పి యేమి యైంద్రజాలికుడో తెలియదు. ఈ యాడుచున్న గాలిని జూచి వెలుగని భ్రమ. వెలుగు లేకున్నను జీవి యూపిరాడుటతో బ్రతుకును. గ్రుడ్డివాడు బ్రతుకును. చెవిటివాడు బ్రతుకును. ఊపిరాడుటయే బ్రతుకుట. ఆ ముప్పదియేండ్లు నాకూపి రాడుచుండెను. బ్రతుకుచుంటిని. వెలుగు లేదు.

ఈ ముప్పదియేండ్లలో నొకనాడు మా రహస్య సమయమున బాదుషా నాలో నిదురపోవుచున్న ప్రేమను నిద్రత్రాచును వలె గదలించి లేపెను. నా భర్తను దానే చంపించితినని నాతో ప్రణయ రహస్యము చెప్పెను. అహో! అప్పటి నాస్థితియేమి? లోపలి కోపమంతయు బయటికి వదలుటయా? ముడుచుకొనుటయా?

ఈ చీకటి కొట్టులోనికి నేను రాకముందు పదిదినముల క్రింద జనిపోయినట్లు, అంతకు పూర్వము నెలనాళ్ళు వ్యాధిగ్రస్తురాలైనట్లు – పాదుషా యొక్క పగ దీర్చుకొనుట యంత చమత్కారముగా నుండెను! ఏవో యౌషధములచేత నెలనాళ్ళు నేను వ్యాధిగ్రస్తురాలనుగా గన్పింపజేసెను. తరువాత నేను చనిపోయినట్లు నా శరీరము నిర్వాయువుగా చేసెను. పదిరోజులు దానొక్కడే నా శవమనిపించుకొన్న శరీరమును దాచిన పెట్టెతో నొంటిగా నొక రహస్యపు గదిలో గూర్చుండి లోకమునకు దన దుఃఖమును జూపెను. చివరకా పెద్దపెట్టె తీసుకొని పోబడి పూడ్చబడెను. ఆ పెట్టె పాతిపెట్టబడిన చోట కొన్ని కోట్లు ఖర్చుపెట్టి మసీదు కట్టించుచుండెను. ఆ మసీదున్న న్నినాళ్ళు నా యొక్కయు నతని యొక్కయు ప్రేమపాటలై పద్యములై కథలై, శిల్పములై దేశదేశము, కాలకాలము వెలిగించునట. నేను బ్రతికియున్న సంగతి పాదుషాకు తెలియును. ఇక్కడకు నన్నెవరు తెచ్చిరో తెలియదు. పాదుషాయే మోసికొని వచ్చెనో? ముప్పదియేండ్లు నేను రాజ్యమునందు సర్వాధికారము చేసితిని. ఈ రాజ్యమునందు నాకు తెలియని

యంగుళము మేరలేదు. ఈ చీకటి కొట్టెక్కడ నున్నదో నాకు తెలియదు. ఇది కోటలోననే యున్నదా? రాజ్యపు పొలిమేరల యందెందైన మహాపర్వతముల నడుమ నున్నదా? నిర్జనారణ్యము నందున్నదా? ఇచ్చటికి దినదినమాహార మెచ్చటనుండి వచ్చుచున్నది? ఈ గాలి యెచ్చటిది? ఆ గడియసేపు వెలుగెచ్చటి నుండి వచ్చును? ఈ గోడలలో నెచ్చటను సందులేదే?

ఇంతకు పాదుషా నన్నెందుకిట్లు చేసెనందువేమో! నాకొక సంగతి తెలిసెను. నా భర్త చనిపోలేదని నా భర్తను జంపించినట్లు పాదుషా వట్టి పుకారు పుట్టించెనని, నా భర్త నెచ్చటనో ఖైదు చేసి యుంచెనని.

అది తెలిసినప్పటినుండి నా యాత్మకొక యావేగము కలిగెను. ఈ రాజ్యములో బాదుషా మాటకన్న నా మాటకు వెల యెక్కువ. నేనేది చెప్పిన పాదుషా యది చేయును. పాదుషా యొకటి చెప్పి నేనొకటి చెప్పిన రాజ్యమంతయు నేను జెప్పినది చేయును. నేను చెప్పినది చేయక పాదుషా చెప్పినది మాత్రమే చేసెడివాడీ రాజ్యమంతటిలో నొక్కడే. వాని పేరు జాన్వరు. వాడు జాన్వరు.

నేనా భర్తకోస మన్ని ఖైదులు వెదకించితిని. మూలమూలలు పరిశోధింపించితిని. దూరదూరములు ప్రయాణములు చేసితిని.

ఈ నాహృదయాంతరాంతర నిగూఢ రహస్యము పాదుషా యా కట్టెను. ఆకట్టెనని నాకెప్పుడు తెలియును? నేను జబ్బుగా నుంటి నన్నప్పుడు నాకు తెలియదు. నేను చనిపోతినని పెట్టెలో బెట్టి, యా పెట్టెతో రహస్యముగా బాదుషా యొక్కడు చనిపోయిన నాకొఅకు దుఃఖించుచున్నాడన్న సమయములో నన్నా చావువంటి నిద్రలో నుండి మేల్కొలిపి యతడు నాతో జెప్పినప్పుడు తెలియును. అప్పుడు నేను దిగ్భ్రాంతురాలనై పోయితిని. నీ మగనికి గట్టించిన సమాధివంటిదే నీకు గూడ గట్టించుచుంటినని చెప్పెను. దాని పేరు 'గోలీ మహల'ట.

ఆ పాదుషా అరబ్బీ పార్సీభాష యందెంత పండితుడో సంస్కృత భాషయందంత పండితుడు. ఆ భాషలయందు గొంచెము తక్కువగా నాకును జ్ఞానము కలుగజేసినాడు. ఆ సంస్కృత భాషలో 'ర'కార 'ల'కారములు కెక్కువ భేదము లేదు. వాని రెంటికి నభేదము. గోలీమహలనగా గోరీమహలట. అన్ని కోట్లమంది హిందువులకు జక్రవర్తియైన యతని పాండిత్యమీమాత్రముండదా?

'అని' యా పాదుషా చేసిన వికృతహాసము నా గుండెలలోని సర్వమార్దవము నెండించెను. నా ముఖములో నప్పుడు పాదుషా యొక పిశాచమును జూచియుండును. కాని యప్పుడు నేను గూర్చుండి యున్నానే కాని నా చేతులను కాళ్ళను గదలించు శక్తి కూడ లేకుండెను. నా శరీరము చూచినచో నంత శుష్కించలేదు. కాని వ్రేలు కూడ గదలించరానంత శక్తి యెట్లు లేకుండెనో తెలియదు. మఱల నీ చీకటి కొట్టులో మెలకువ వచ్చినప్పటినుండి కాలుసేతు లాడుచుండెను. ఈ స్థితిలో నెప్పుడో యొకప్పుడు కన్ను కూర్కుచుంటిని. వెలుగు వచ్చెడి వేళకు ఆ యింత రొట్టెయు దినుచుంటిని. "ఆహా! మెహర్! మెహర్! ఓహోహో! కరీం! కరీం!"

అని యామె దీర్ఘ నిశ్వాసము విడచెను. ఈ చివరి వాక్యములు చెప్పు వేళకు వెలుగులు వచ్చు గడియ యా గదిలో ప్రారంభించెను.

ఆమె యా పురుషుని వంక జూచి "నీవెవరు? నీపేరేమి? నీవిచ్చట నెందుకుంటివి?" అనెను.

అతడు కన్నులు నిశ్చలముగా జూచి యిట్లనెను.

"ముప్పది యేండ్లయినదా! నాకు కాలజ్ఞానము పోయినది. నేను బ్రతికియున్నానా! ఇప్పుడు నేను బ్రతికి యున్నానని తెలిసినది. నేను మాట్లాడుచున్నానా! మాట్లాడు శక్తి నాకు గలదా? అవును. పూర్వము నాకుండెడిది. నీ మాటలు విన్న కొలది నాయంతర్హితమైన శక్తి మఱల క్రమక్రమముగా వృద్ధి పొందినది!."

ఇట్లు మాటాడుచుండగా, మెహరునకు ఆ వ్యక్తి యొక్క కనుచూపులో, పలుకు సవ్వడిలో, ముఖావయవ స్వల్ప చాలనములో, నేదో యొక యవ్యక్తమైన పూర్వపరిచితి వైభవము యొక్క స్మృతిరేఖగా దోచి, విజృంభించి సంపూర్ణమైన రూపుకట్టెను.

అతడున్నవాడున్నట్లుగా నొక శిలకు హఠాత్తుగా బ్రాణము వచ్చినట్లు, ఒక విచిత్రమైన కదలిక పొంది చేతులుచాచి కన్నులవెంట నీరుగార్చుచు నిట్లనెను.

"మెహర్! మెహర్!"

"కరీం! కరీం!"

అంతట వెలుగులారు గడియ పూర్తియయ్యెను. చీకట్లు చీకట్లు నెడము లేకుండ కౌగలించుకొనెనేమో!